# గొప్పవారి సరదాలు

ప్రపంచంలో అందరికీ మైసూరుపాక్ లే యిష్టమైతే, పకోడీ లమ్మేవాడు, తను చేసిన పకోడీలే తిని బతకాలి. వాడికి మైసూరుపాకు లుండవు సరికదా అన్నం కూడా వుండదు. ఆడా మొగా అంతా టైట్ పాంట్సు, జెర్కిన్సు వేసుకు తిరుగుదా మనుకుంటే చీరల కంపెనీవాళ్ళు ఆ చీరల తోనే నెత్తిన చెంగేసుకోవాలి. అందరిరుచులూ ఒక్కలా వుంటాయా ? వుండవు. అందుకే జిహ్వాకోరుచి అన్నారు.

అభిరుచులూ అంతే, ప్రెసిడెంటు జాన్సన్ కి పికిలి పిట్టలు పందేలంటే యిష్టంవుండొచ్చు. అతనికి పికిలిపిట్టలు దొరక్కపోవచ్చు. టుంకూ అబ్దుల్ రహమాన్ కి తబలా వాయించాలన్న వాంఛ వుండొచ్చు. అతనిదగ్గర బోలెడు తబలా లుండొచ్చు. కాని వాయించడం రాకపోవచ్చు. వాయించడం వస్తే టైము లేకపోవచ్చు.

నలుపు కొందరి కిష్టం. తెలుపు యిష్టం కొందరికి. మరి కొంతమందికి అమెరికన్లంటే యిష్టం. ఇంకా కొంత మందికి నీగ్రోలంటే యిష్టం, అధమం నీగ్రోలకి, కొందరికి గాంధీగారీలాగా, గావంచా కట్టుకొని, ఆశయాలకోసం

జీవించి, మర్డర్లై పోయి, చరిత్రలో శాశ్వత ముద్ర వేసుకోవాలని వుంటే యింకొందరికి హిరణ్యకశిపుడిలాగో, హిట్లర్లాగో ప్రపంచాన్నంతా జయించి ప్రజల నెత్తురు తాగడం యిష్టం.

భారతం కొంద రిష్టపడితే, బూతుపుస్తకా లంటే కొందరు ప్రాణం యిచ్చేస్తారు. పంచతంత్రం కొందరు పారాయణం చేస్తే, పెర్రీమేసను కొందరు యిష్టపడతారు. ఒకరికి నాగేశ్వరరావు, మరొకరికి నాగేష్. ఒకరికి సావిత్రి, ఇంకొకరికి సయీరాబాను. కొందరికి కామెడీలు, కొందరికి ట్రాజెడీలు యిష్టం.

ఆఖరివి యిష్టమైనవారిలో, ఇంగ్లండులో చదువుకొని, స్విట్జర్లండులో స్కేటింగు నేర్చుకొని, పందొమ్మిదో ఏటే పట్టభద్రురాలైన మల్టీ మిలియనేర్ మధుసూదనరావుగారి ఏకైక పుత్రిక రాధని చెప్పుకోవచ్చు. ఆవిడకి ట్రాజడీ లంటే వెర్రి యిష్టం.

అస లావిడ పుట్టుకే మంచి గమ్మత్తయిన సినిమాటిక్ ట్రాజడీ అట. అవిడతల్లి లలితమ్మ నెలలు నిండగనే పురిటికి పుట్టింటికి వెళ్తోందిట. సగంతోవలో అనుకోకుండా పెద్ద గాలి, వాన వచ్చాయట. అలాంటి భయంకర వాతావరణం అలవాటులేని లలితమ్మ అలవాటుప్రకారం మూర్ఛపోగా, ఆ కార్లోనే రాధ పుట్టిందిట. ఇదంతా తరుచు లలితమ్మ రాధతో వర్ణించి చెప్పినప్పుడు "ఎంత ట్రాజికల్ బర్త్ నాది!" అని రాధకళ్లు సంతోషంతో మెరుస్తాయి.

రాధ తన ఎయిర్ కండిషన్డు గదిలో కూర్చొని ఎప్పుడూ బీదలపాట్లూ, అనాథల ఆర్తనాదాలూ, ఆకలి

అరుపులూ గల పుస్తకాలే చదువుతుంది. ఏరోప్లేనులాంటి కార్లో వెళ్ళి బీదవాళ్ళ పిల్లలకి చాక్లెట్లు, క్రీమ్ బిస్కట్లు పంచని రోజుండదు. ఎర్కండిషన్డు థియేటర్లో ఆమె ఎప్పుడూ ఇటలీ పేదవారి సినిమాలూ, ఫ్రెంచి విప్లవానికి ముందువారి పేదప్రజల పాట్లూ చూస్తుంది. ఆమె గదిలో వ్రేలాడుతున్న నిలువుసైజు తైలవర్ణ చిత్రం "భిక్షుకి", ఆమె యీ మధ్య సమ్మర్కి బెంగుళూరు వెళ్ళినప్పుడు అక్కడ ఎగ్జిబిషన్లో మూడువేలకి కొంది.

అసలావిడికి గొప్పవాళ్ళంటే అసహ్యం. పేదవాళ్ళే ఆమె ప్రాణస్నేహితులు. ఆమె ఎందరో బీదవిద్యార్థులకి జీతాలు కట్టి పుస్తకాలు కొంది. వాళ్ళ మమ్మీ కొన్న టెర్లిన్ చీరలు, బెనారసు బ్లౌజులు సగం పైగా యింకా కొత్త మాయకుండానే అడుక్కునే వాళ్ళకీ, అనాథ శరణాలయాల్లో ఆడపిల్లలకీ యిచ్చేస్తుంది.

ఆమెకు మామూలు మనిషి కోరుకొనేవీ, కోరుకోలేనివీ అన్నీ వున్నాయి. ఒక్క పరీక్ష కూడా తప్పలేదు. అర ఔన్సు మందు ఒక్కనాడూ తాగలేదు. వాళ్ళ డాడీ తిట్టలేదు. వాళ్ళ మమ్మి కసరడంకూడా చెయ్యదు. పోని తల్లిలేని పిల్లగానైనా కనీసం బాధ పడడానికి వీల్లేకుండా పోయింది, అప్పుడే పోతపోసిన కంచువిగ్రహంలాంటి తల్లి వుండబట్టి. డబ్బు అవసరానికి సరిపోయేదేమో బాధపడదాం అంటే, ఆమె అడక్కుండానే అడగదల్చుకున్నదానికి రెట్టింపు యిస్తారు వాళ్ళ డాడీ.

ఆమెకున్న ఒక్క కష్టవ్వూ, తనకి మనిషి కుండవలసిన

కనీసపు కష్టాలన్నా లేవే అన్న బాధే. ఆ బాధ ఆవిడ నర నరాన్నీ పీల్చివేస్తోంది, క్రిష్టియన్లలో కలిసిపోయి, ఏ ఆఫ్రికాలోనో, ఏ కుష్టువారికో సేవచేద్దామా అనుకునేది వోసారి. మరోసారి తనో పెద్ద రచయిత్రి అయిపోయి ఆకలి అరుపులతో, పేదల పిలుపులతో, కారే కన్నీళ్ళతో కలవారి మనసుల్ని మార్చేద్దామనుకునేది. మరోసారి పెద్ద ఫ్యాక్టరీ పెట్టి, అందులో పన్చేసే కూలాళ్ళందరికీ తలోవాటా యిచ్చేద్దామనుకునేది. ఇంకోనాడు తమ కారు బీదడ్రైవర్ని పెళ్ళాడేసి, వాడికి చదువూ, సంస్కారమూ మప్పి, వాణ్ణో పెద్ద సినిమా హీరో చెయ్యాలని అనుకొని, వాడి కిదివరకే యిద్దరు పెళ్ళాలు, ముగ్గురు ముండలు వున్నారనీ, వాడు వాళ్ళందర్నీ వంతులవారీగా తంతాడనీ తెలుసుకొని ఆ ప్రయత్నం మానేసింది. ఆఖరికి ఏ కులంతక్కువ వాడినో ప్రేమించి, భగ్నహృదయంగా, భారంగా వీణ మీటుతూ, తన శేషజీవితం ఏ కాశీలోనో గడుపుదామనుకొంది. కాని ఆమెని తక్కువకులం వాడు కాని, ఎక్కువ కులంవాడు కాని ఎప్పుడూ ఆకర్షించలేదు.

"ఇంక నా జీవితానికి కష్టాలు రాయలేదు కాబోలు భగవంతుడు" అని ఆమె విచారిస్తున్న సమయంలో, "యింక నా కష్టాలకేం కొదువలేదు" అనుకొంది. ప్రథమంగా డాక్టర్ రామనాధరావుని చూసినప్పుడు.

అతనికి ట్రాజెడీ లంటేనే యిష్టం. అయితే భగవంతుడికి అతనంటే యింకా యిష్టం. అందుచేత భగవంతుడు అతనిపట్ల కరుణ కలిగినవాడై, ఎప్పుడూ ముద్దాడే అతని

తల్లిని తీసుకొని, నిత్యం తన్నే సవ త్తల్లిని అతి చిన్నతనం లోనే యిచ్చి, అతను కాస్త పెద్దయ్యేలోగానే, అదే కరుణతో అదే భగవంతుడు - తనకున్న రెండెకరాలూ రెండో భార్యపేర రాయించేసి, అతని తండ్రిని తీసుకొనిపోయేడు. ఇంక ఆ తర్వాత రామనాధరావు ఒకరింట్లో తిని, మరొకరి అరుగుమీద పడుకొని, పక్కవాడి పుస్తకాలు చదివి పరీక్షలు పాసై, ఎమ్మెస్ చదువుతున్నాడు.

"ఎన్ని కష్టాలతనికి!" అని అసూయ పడింది రాధ.

డాక్టర్ రామనాధరావు అందగాడు. అహంకారి కాడు. రంగులో రాధకన్న తెలుపైనా, వర్ణంలో రాధకన్న రెండు మూడు మెట్లు తక్కువ. పొడవులో ఆమెకంటె రెండుమూడంగుళాలు ఎక్కువున్నా, ఆస్తిలో పది పన్నెండు లక్షలు పొట్టివాడు. రాధ ఆస్తి కనీసం పన్నెండు లక్ష లుంటుంది.

"అన్ని విధాలా నాకు తగినవాడు" అనుకోసాగింది రాధ. అతన్తో పరిచయం పెరుగుతున్నకొద్దీ, ఎంత ముదిరినా ఏమీ అనుకుంటున్నట్టు లేదు రామనాధరావు.

* * *

ఏటొడ్డున యిసుకలో సరుగుడుతోట దగ్గర రాధా, రామనాధరావూ కూర్చున్నారు. పన్నీరులా ప్రవహిస్తోంది పక్కనున్న సెలయేరు. సెలయేటి సంగీతానికి సన్నగా ఆలాపిస్తున్నాయి సరుగుడు చెట్లు. దేవతలు రాసక్రీడ లాడుకుంటున్నట్లు ఎర్రబడింది ఆకాశం. చెట్టుమీది పిట్టల జంట ఒకటి క్రిందనున్న జంటను చూసి గుసగుస లాడుతున్నాయి.

"ఎంత బావున్నారో వీళ్ళు" మీటింది జవరాలు.

"ఆవిడకి అతనంటే ప్రాణం." మొగపిట్ట ముదల కింపు.

"మరే! అతనికి మాత్రం. పాపం పైకి చెప్పాలంటే భయం."

వాటి సంభాషణ యిలా వూహించుకుంటున్న రాధ, "పూర్వం రాకుమారులకి పక్షి భాష వచ్చేదట. నేను కూడా ఆ రాకుమారుడినైతే ఎంత బావుణ్ణు!" అన్న రామనాధరావు మాటకి ఉలిక్కిపడింది. ఆ మాటల అంతరార్థం అవగతం కాగానే ఆవిడ శరీరం సిగ్గుతో జలదరించింది.

• • •

తన ప్రణయం, రామనాధరావుని పెళ్ళాడతలచిన వైనం రాధ తల్లితో చెప్పింది.

"ఛీ! సిగ్గుమాలినదానా! నాతో యీ మాట చెప్ప డానికి నీకు నోరెలా వచ్చిందీ? కులం తక్కువ వెధవనీ, అనా కానీకి ఠికానాలేక అరుగుమీద చదువుకున్న అప్రాచ్యుణ్ణీ చేసుకుంటా ననడానికి అసలు నీకు బుద్దెలా లేకపోయింది? అసలు నిన్నని ఏం లాభం? నిన్ను పెద్దచదువులు చదివించి, మగాడిలా పెంచిన మీ నాన్నని అనాలి. ఇంటావంటా ఏనా డైనా ఎరుగుదుమా యిలాటి అపభ్రంశపు పనులు? మా వంశంలో చెడపుట్టేవు నువ్వు. ఏం చూసి వరించేవు తల్లీ వాడినీ? అందంవుంటే చాలనుకున్నావేమో, ఆనక అడు క్కోవడానిక్కూడా అర్హత వుండదు నీకు. ఛీ! ఛీ!! ఇవాళ

నుండి నీకు నేను అమ్మనుకాను. నాకు నువ్వు కూతురివి కావు. అసలు నాకు పిల్లలే పుట్టలేదనుకుంటాను. ఫో, నా ఎదుటనుండి" అని తల్లి అంటుందని ఆశించిన రాధకి, "నీ యిష్టం కాదన్న దెప్పుడు తల్లీ! నీ యిష్టమే మా సంతోషం. పోయి మీ నాన్ననికూడ అడుగు" అన్న లలితమ్మ మాటలకి మతిపోయినట్లయింది.

ఆ రాత్రి - డ్రాయింగ్ రూములో గోడల గులాబీ రంగు ట్యూబులైట్ల కాంతిలో వెలిసినట్లుగా కనిపిస్తోంది. సంతర్పణలో దిక్కుమాలినవాళ్ళ గోలలా వుంది బైట వర్షం రొద. మూసిన కిటికీతలుపు సందుల్లోంచి బుసకొడ్తున్న నాగులా ప్రవేశిస్తోంది ఈదురు గాలి. బయటి వాతావరణమంతా రాధ మనస్సులాగే భీభత్సంగా వుంది.

ఆరో పెగ్గు వేసుకుంటున్న మధుసూదనరావుగారి కళ్ళు, బైట మెరుపు కాంతిలో ఆకలితోవున్న పులి కళ్ళలా ఎర్రగా మెరుస్తున్నాయి.

మాటలు తూస్తూ నెమ్మదిగా, బరువుగా అంతా వివరించిన తరువాత రాధ, "అతనికీ యిష్టవేఁ. మీ అంగీకారం, ఆశీర్వాదాలు కావాలి డాడీ" అని దేవుడిలా వున్న రాయీ, రాతిలో వున్న దేవుడూ కరిగేలా ప్రార్థించింది అతన్ని.

మిలియనేర్ మధుసూదనరావుగారి కళ్లు యింకొంచెం ఎరుపెక్కాయి. V A T 60 బాటిలు ఎంతో మెజిస్టిక్‌గా పట్టుకొని, ఎడమ చేతిలోని గ్లాసులో ఏడో పెగ్గు పోసుకుంటూ వుంటే తొలిసారి అతని చెయ్యి వణికింది. అతను

రాధ వేపు సూటిగా చూస్తూ సిప్ చేసిన గ్లాసు టేబిలుమీద పెట్టేసి "సో నువ్వా కుర్ర డాక్టర్ని పెళ్ళాడతానంటావు. అవునా, కమాన్. లెటజ్ టాక్ ఫ్రేంక్లీ, నీ వయస్సెంత? మహాపుంటే యిరవై. ఇంక నువ్వు చూసిన ప్రపంచం ఎంత? స్విట్జర్లండులో ఐసుగుట్టలు, లండన్లోని స్కూలు బిల్డింగు, మనిల్లు, అంతేనా. ఇంక మనకున్న ఆస్తి ఏ మాత్రం వుంటుందో నువ్వు అంచనా వెయ్యగలవా? పన్నెండు లక్షల పైనే అని నా జ్ఞాపకం. రామనాథం డాక్టరై నెల కెంత తేగలడు? అయితే ఆరువందలు. కాకపోతే వెయ్యిలోపు. 'నా ఆస్తి అతన్ది కాదా!' అనఁడుగుదామని, నీకుంది. నాకు తెలుసు. కాని నీది అతన్దెలా అవుతుందే పిచ్చి తల్లీ? ఈ కాలంలో ఎవరికర్మ వాడిది. ఎవడి పాపం వాడిది. అలాగే ఎవడి డబ్బు వాడిదే, మొగుడు పెళ్ళాని కిస్తున్నాడా? తల్లి పిల్లకి పెడుతోందా?

"చీపురు కట్టతో తుడుచుకుంటాంగాని, ఫ్లవర్ వాజులో పెడతామా? పెట్టం. గొప్పవాడు కొన్ని పరిస్థితుల్లో బీదవాడౌతాడేమోగాని బీదవాడు ఏ పరిస్థితుల్లోను గొప్ప వాడు కాడు. కాలేడు. ఇంక కులం అంటావా? డబ్బుతోనే కులంకూడా వస్తుంది. డబ్బు లేకపోతే వున్న కులంకూడా పోతుంది. ఇదీ యిప్పటి పరిస్థితి." అంటూ సిప్ చెయ్యడం కోసం ఓ క్షణం ఆగేరు.

అతని మాటలు వింటున్న రాధకి తన కింద భూమి పగిలి సీతాదేవిలా భూమిలోకి దిగిపోతున్నట్టూ, తన

బంగళా గోడలు పగిలి తను సజీవ సమాధి అయిపోతున్నట్టు అన్పించింది.

"కాబట్టి నువ్వు తీసుకున్న నిర్ణయానికి నిన్ను అభినందిస్తున్నాను. నిన్ను చూసి గర్వపడుతున్నాను. విష్ యు గుడ్ లక్" అంటూ ముగించేరు.

అప్పుడు కూడా అతని మాటలు విన్న రాధకి తన పాదాలకింద భూమి పగిలిపోతున్నట్లు, తన బంగళా గోడలు కూలిపోతున్నట్లు అన్పించింది.

"కాశీలో శేష జీవితం భగ్న ప్రేమికురాలిగా గడుపుదామన్న ఒక్క కోరికా కూడా తీరలేదు" అని కుమిలి పోయింది.

—: o :—